క్లుప్తంగా

నేటి నుంచి ఉర్సు


ఉత్సవాలకు ముస్తాబైన ముర్షద్ దర్గా

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ముర్షద్ దర్గాలో గురువారం నుంచి ఉర్సే షరీఫ్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ముతావల్లి, సజ్జాదనషీన్ అల్హాజ్ సయ్యద్ అబ్దుల్ గని పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతే కాక హజ్రత్ సయ్యద్ అబ్దుల్ సలాంపాషా ఉత్సవాలు కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేటి రాత్రి 7 గంటలకు గంధం తెచ్చే కార్యక్రమం, 8గంటలకు సందల్ మాలి, శుక్రవారం దీపోత్సవం, ఖవ్వాలి ఉంటాయని తెలిపారు. శనివారం నమాజ్ బాద్ ఫజర్ తిలావత్ ఖురన్‌పాక్, ఫాతే హఖ్వాని అనంతరం ప్రసాదం పంచనున్నట్లు పేర్కొన్నారు. కావున ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

బార్ అసోసియేషన్‌లో రక్షాబంధన్


న్యాయవాదులకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్

అనంతగిరి: వికారాబాద్‌లోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో బుధవారం రక్షాబంధన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న బీట్ ఆఫీసర్


పీడీకి ఫోన్ అప్పగిస్తున్న బీట్ ఆఫీసర్ కాశప్ప

యాలాల: రోడ్డుపై దొరికిన సెల్‌ఫోన్‌ను ఫారెస్టు బీట్ ఆఫీసర్ బాధితుడికి తిరిగి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని పగిడియాల ఉన్నత పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు విజయభాస్కర్ విధులు ముగించుకొని తాండూరుకు వెళ్తున్నాడు. బాగాయిపల్లి సమీపంలో రోడ్డుపై పడిపోయింది. అదే మార్గంలో వికారాబాద్‌కు వెళ్తున్న కమాల్‌పూర్ సెక్షన్ బీట్ ఆఫీసర్ కాశప్ప రోడ్డుపై సెల్‌ఫోన్‌ను గుర్తించి కాల్ లిస్టు ఆధారంగా బాధితుడి వివరాలు తెలుసుకొని పీడీకి తిరిగి ఫోన్ అప్పగించాడు.

స్వయం ఉపాధితో ఎదగాలి

పరిగి సీఐ శ్రీనివాస్‌రెడి

పూడూరు: యువత స్వయం ఉపాధిని ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చన్గోముల్ గ్రామంలో వెంకటేశ్, ప్రవీణ్‌లకు చెందిన పీవీ టిఫిన్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, బిర్యాని హోటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని సూచించారు. గ్రామాల్లో యువత ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్‌ల బారిన పడి నష్టపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో చన్గోముల్ ఎస్‌ఐ భరత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు యాదగిరిగౌడ్, సుధాకర్‌గౌడ్, నర్సింలు, వెంకటయ్య, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న అనిత

దోమ: ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. బుధవారం కిష్టాపూర్, పలుగు, కుమ్మరికుంట, ఐలాబాద్ తండా పాఠశాలలో ఎన్‌జీఓ ప్రతినిధులు రజిత విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్యాడ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..అనిత విద్యార్థులకు చేస్తున్న సేవలు సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రధానోపాధ్యాయులు లాల్యానాయక్, అనంతయ్య, అక్రమ్, జలాలోద్దీన్, కాంప్లెక్స్ సీఆర్‌పీ రెడ్యానాయక్, గ్రామస్తులు షారెడ్డి, రాములు పాల్గొన్నారు.

పెరిగిన సాగు

బీడు భూముల్లో సైతం వ్యవసాయం
- పెట్టుబడి సాయం అందజేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- రైతు సంక్షేమానికి చొరవ


పడావు భూమిలో పత్తి సాగు

దౌల్తాబాద్: కొన్ని యేళ్ల నుంచి కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. పంటల సాగు కోసం అనేక పథకాలు, పెట్టుబడి సాయం అందజేస్తున్నాయి. దశాబ్దాలుగా బీడు భూములు, వదిలేసిన నేలలను సైతం సాగులోకి తెస్తున్నారు. దీంతో ప్రతియేటా ఆయా గ్రామాల్లో సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతుంది. బీడు భూములను చదును చేసి పంటలు పండిస్తున్నారు. రాళ్ల భూములను సైతం వ్యవసాయానికి అనుకూలంగా మార్చుకొని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

ఏటా మూడు విడతలుగా..

పంటల సాగు కోసం రైతులు ఇబ్బంది పడకుండా కొన్ని సంవత్సరాలనుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టబడి సాయాన్ని అందజేస్తున్నాయి. ప్రతియేటా మూడు విడతలుగా రూ.2వేల చొప్పున, రూ.6వేలు పెట్టుబడి సాయంగా అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎకరానికి రూ.10వేల చొప్పున అందించగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12వేలు చొప్పన రెండు విడతలు సాయం అందజేసింది.

పడావు భూములకు డిమాండ్

గతంలో వ్యవసాయ భూములకు డిమాండ్ అంతంతగానే ఉండేది. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పెట్టుబడి అందిస్తుండడంతో భూములకు సైతం అధిక డిమాండ్ పెరిగింది. రాళ్ల భూములు, బీళ్లు, ఎత్తు పల్లాలు ఉన్నవి సాగుకు పనికిరావనే కారణాలతో గతంలో వదిలేశారు. అలాంటి భూముల్లో సైతం నేడు వ్యవసాయానికి అనుకూలంగా మలచుకుంటున్నారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాలు

ఏఈఓ సందీప్

బంట్వారం: పాడి రైతులకు 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందజేస్తున్నామని వ్యవసాయ శాఖ కోట్‌పల్లి ఏఈఓ సందీప్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేలుజాతి హైబ్రిడ్ గడ్డి విత్తనాలు పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఐదు కేజీల మినీ కిట్‌కు రూ.175 చెల్లించాలని పేర్కొన్నారు. గడ్డి విత్తనాలు అవసరమున్న పాడి రైతులు పశుసంవర్ధక అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దాడులకు పాల్పడే వారిని అరెస్ట్ చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య


మాట్లాడుతున్న వెంకటయ్య

పరిగి: పరిగి, కొడంగల్, తాండూర్ నియోజవర్గాల్లో రోజు రోజుకు దళితులపై దాడులు పెరుగుతున్నాయని, దాడులకు పాల్పడే వారిని వెంటనే అరెస్ట్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్ మండలంలోని పర్సాపురం, రేగడిమైలారం, దుద్యాలలో దళితుల భూములను అక్రమంగా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిట్టకోడూర్ గ్రామంలో దళిత మహిళను అగ్రవర్ణాల వారు కులం పేరుతో దూషించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో బాధితులకు రక్షణ కల్పించి, బాధ్యులను శిక్షించాలని అనేక సార్లు ఫిర్యాదులు ఇచ్చినా లాభం లేదన్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు, హబీబ్, సత్తయ్య, రఘురాం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముర్రు పాలే బిడ్డకు శ్రేష్టం


మోమిన్‌పేట: కోల్కుందలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పుష్పలత


పూడూరు: సోమన్‌గుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన నిర్వహిస్తున్న సిబ్బంది

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత

మోమిన్‌పేట: ముర్రు పాలే బిడ్డకు శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కోల్కుంద, మోమిన్‌పేట గ్రామాల్లో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తల్లుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు ముర్రుపాలే పట్టించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు గోంగమ్మ, రేణుక, ప్రమీల, మమత, వసంత, విమల, ఆశవర్కర్ సునీత పాల్గొన్నారు.

తల్లి పాలు అమృతం

మర్పల్లి: పుట్టిన పిల్లలకు తల్లిపాలే ఆరోగ్యమని ఎంఈఓ అంజిలయ్య, మర్పల్లి సీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానబేగం అన్నారు. అంగన్‌వాడీ మెదటి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ముర్రు పాలల్లో రోగ నిరోధకశక్తి అధికంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ వర్కర్ మొగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: పుట్టిన బిడ్డకు తల్లి పాలే అమృతమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ మంజుల పేర్కొన్నారు. గౌరారం గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ టీచర్ సుకన్య, బాలమణి, పల్లె దవాఖాన డాక్టర్ హర్షవర్ధన్, ఏఎన్‌ఎం కవిత, ఆశ కార్యకర్త వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి పాలు తాగించాలి

పూడూరు: పుట్టిన ప్రతీ బిడ్డకు తల్లిపాలు తాగించాలని డాక్టర్ శాంత తెలిపారు. సోమన్‌గుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలే మొదటి టీకా అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు అరుణాదేవి, ప్రభావతి, ఆశావర్కర్ శయనాజ్‌బేగం, బిస్మిల్లాబీ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కుల్కచర్ల: పౌష్టికాహారం తీసుకుంటేనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, బిడ్డకు పాలు తాగించడంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. పద్మమ్మ, లత, అనసూయ, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: తల్లి పాలు బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం–2 లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ముర్రుపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనసూజ, రేణుకాదేవి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


లక్ష్మీనరసింహాస్వామి దేవాలయానికి విరాళం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

పీఏసీఎస్ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

దోమ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పీఏసీఎస్ మాజీ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గ్రామంలోని లక్ష్మీనరసింహాస్వామి ఆలయ నిర్మాణానికి ఆయన రూ. 20వేలు, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి రూ. 20వేలు వేరువేరుగా విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజలందరూ భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. ఆలయ నిర్మాణానికి తమ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జగత్‌రెడ్డి, దస్తయ్య, వెంకటయ్య, మొగులయ్య, దస్తప్ప, లక్ష్మయ్య, జానప్ప, కిష్టయ్య, వెంకటేశ్, పూర్ణయ్య, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గడపకూ కేంద్ర సంక్షేమ పథకాలు

బీజేపీ మండల అధ్యక్షురాలు అనసూయ


రూప్‌ఖాన్‌పేటలో ప్రధాని మోదీ పాలన గురించి వివరిస్తున్న అనసూయ

పరిగి: ప్రతీ గడపకు కేంద్ర సంక్షేమ పథకాలు చేరుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షురాలు నీరటి అనసూయ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్, మిట్టకోడూర్, గోవిందపూర్ గ్రామాల్లో మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రధాని మోదీ 11 సంవత్సరాల పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి దేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమి లేదన్నారు. బీజేపీ అధికారంలోకొచ్చాక దేశంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ప్రపంచ దేశాలతో పోటీపడి పనిచేస్తుందన్నారు. భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిపారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నర్సింహులు, అనంతరాములు, నవీన్, కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో భాగస్వాములు కావాలి

దోమ: గ్రామ సభల్లో గ్రామస్తులు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ గ్యామా తెలిపారు. బుధవారం దోమ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి నిర్వహించిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై వివిధ అంశాలపై చర్చించి గ్రామ సభలో తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలో సమస్యలు రాకుండా కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో గడ్డీ మందు పిచికారి చేసి మురుగు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లి కాలనీలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఎర్రమట్టి తవ్వకాలను నిలిపేయాలి


డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యాలాల: మండలంలోని దౌలాపూర్, బషీర్ మియా తండాల్లో చేపడుతున్న ఎర్రమట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం డీటీ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దౌలాపూర్ శివారులోని సర్వే నంబరు 73, 78లలో పది రోజులుగా భారీ యంత్రాలతో తవ్వి ఎర్రమట్టిని తరలిస్తున్నారన్నారు. సర్వే నంబరు 69లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు కేటాయించగా, ఆ భూమి చదును చేస్తున్నామని చెప్పి, ఇతర సర్వే నంబర్లో తవ్వకాలు చేపట్టడం బాధాకరమన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలక్కయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మెట్లి క్రిష్ణ, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి


విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎస్‌ఐ రమేశ్

ఎస్‌ఐ రమేశ్

కుల్కచర్ల: సైబర్ నేరాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని కుల్కచర్ల ఎస్‌ఐ రమేశ్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు అధికమైనందున సైబర్ మోసాల సంఖ్య ఎక్కువగా పెరిగిందన్నారు. విద్యార్థులు తమ ఇళ్లలోని పెద్దలకు సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. బ్యాంకుఖాతాలకు సంబంధించిన విషయాల్లో ఓటీపీలు చెప్పొద్దన్నారు. విద్యార్థులు చిన్న, చిన్న విషయాల్లో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సైబర్ మోసాల గురించి విద్యార్థుల చేత స్కిట్లను ప్రదర్శింపజేసి వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అంచన వేసి నివేదిక ఇస్తాం

ఏడీఏ డీఎస్ లక్ష్మీకుమారి


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పరిగి: ఇటీవల కురిసిన అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఏడీఏ డీఎస్ లక్ష్మీకుమారి సూచించారు. బుధవారం మండల పరిధిలోని యాబాజిగూడలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు వాగు నిండి పొంగడంతో పక్కనే ఉన్న పత్తి పంటలు దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రైతులు తప్పకుండా వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రజిత, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం


కొడంగల్: భోజనం పరిశీలిస్తున్న అధికారులు


కుల్కచర్ల: బండవెల్కిచర్ల జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్

కొడంగల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎంఈఓ రాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణ శివారులోని మహాత్మా జ్యోతీరావ్ పూలే బాలుర గురుకులాన్ని సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఆదేశించారు. వంటగది, తరగతి గదులు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు

కుల్కచర్ల: మధ్యాహ్న భోజన పథకంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. బండవెల్కిచర్ల గ్రామంలో జెడ్పీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జహంగీర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయ సాధనకు కృషి

తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలను తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర కీలకమన్నారు.


కొడంగల్: ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ ఉషశ్రీ తదితరులు


బొంరాస్‌పేట: మండల విద్యావనరుల కేంద్రంలో నివాళులర్పిస్తున్న తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ తదితరులు


తాండూరు టౌన్: జయశంకర్ సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


పరిగి: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు


అనంతగిరి: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్


మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి


కుల్కచర్ల: నివాళులర్పిస్తున్న విశ్వకర్మ బ్రాహ్మణ సంఘం నాయకులు


దుద్యాల్: జెడ్పీ హెచ్‌ఎస్‌లో..